క్లుప్తంగా

మేలైన విత్తనాలు సాగు చేయాలి

తుని రూరల్: తెగుళ్ల అదుపులో ఉండి అధిక దిగుబడులు ఇచ్చే వరి విత్తనాలను రైతులు ప్రయోగాత్మకంగా సాగు చేయాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.దయాకర్, డాక్టర్ ఏఎస్ఆర్ శర్మ, డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ ఏడీఏ భ్రమరాంబ సూచించారు. మండలంలోని తేటగుంట రైతు సేవా కేంద్రంలో శనివారం మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్‌జీఎస్ 7039, 7034 రకాల విత్తనాలను (నూతన వంగడాలు) రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. సాంప్రదాయ రకాలు కంటే మేలైన నూతన వంగడాలను రైతులు పండించి మంచి దిగుబడులు సాధించాలన్నారు. నూతనంగా రూపొందించిన ఈ వంగడాల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు కొల్లు సత్యనారాయణ, కోనా కన్నారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు సత్యనారాయణ, భవానీ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తుని: పాయకరావుపేట ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ శనివారం తెలిపారు. అభ్యర్థులు విద్యా ధ్రువపత్రాలతో జూలై 24వ తేదీ లోపు కళాశాలలో రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు 10వ తరగతి మార్కుల లిస్టు, కుల ధ్రువీకరణపత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్ కార్డు, ఆధార్‌తో లింకైన ఫోన్ నంబర్ ఉండాలన్నారు. జులై 27న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి సోమవారం గ్రీవెన్స్

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జయమాధవి శనివారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే ఈ గ్రీవెన్స్‌కు మండలస్థాయి అధికారులంతా విధిగా హాజరు కావాలని కోరారు. గ్రీవెన్స్‌ను హాజరుకాలేని అధికారులు జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

టీబీ రోగులకు పోషకాహార కిట్ల పంపిణీ

తొండంగి: మండలంలోని 25 మంది టీబీ రోగులకు శనివారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. పెరుమాళ్లపురం కాకినాడ సెజ్ ప్రాంతంలోని అరో ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో జిల్లా కుష్టు వ్యాధి నివారణా అధికారి డాక్టర్ ఆర్.రమేష్, అరబిందో సంస్థ ప్రతినిధులు టీబీ రోగులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో అరబిందో సంస్థ ప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో తరలిస్తున్న 60 లీటర్ల సారా స్వాధీనం



నిందితుడు, స్వాధీనం చేసుకున్న సారాతో ప్రత్తిపాడు సెబ్ సీఐ చిరంజీవి

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ఆటోలో తరలిస్తున్న సారాను స్థానిక నరేంద్రగిరి వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడులో శనివారం సెబ్ సిబ్బంది గస్తీ నిర్వహిచారు. సెబ్ సీఐ ఎల్.చిరంజీవి కథనం మేరకు గొల్లప్రోలుకు చెందిన వడిసెల సత్తిబాబు ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామ శివారు కొండ ప్రాంతం నుంచి 60 లీటర్ల సారాను గొల్లప్రోలుకు ఆటోలో రవాణా చేస్తున్నాడు. పోలీసులు స్థానిక నరేంద్రగిరి వద్ద ఆటోను తనిఖీ చేసి, ఆటోతో పాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వడిసెల సత్తిబాబును అరెస్టు చేశారు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

తుని: పట్టణంలో వృద్ధులు, వికలాంగులు, వితంతులకు సోమవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు శనివారం తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల సొమ్ము అందజేస్తారన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు స్థానిక తారకరామనగర్, మేదరపేటలో జరిగే పింఛను పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే యనమల దివ్య పాల్గొంటారని చెప్పారు.

నేడు చిత్రలేఖన పోటీలు

పెద్దాపురం: పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 30 తేదీన పర్యావరణ చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ తెలిపారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శనివారం చిత్రలేఖన పోటీల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామని, 30వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులు 90006 95301, 79016 97939 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

సాగునీటి చెరువుల కబ్జా

- ఆక్రమించిన సమీప రైతులు, రాజకీయ నాయకులు
- ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్న అన్నదాతలు
- తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో 29 వేల ఎకరాల్లో సాగునీటి వనరులు



జగన్నాథపురం, భీమవరపుకోట గ్రామాల మధ్య ఆక్రమణకు గురైన వెంకటాచలం చెరువు

కోటనందూరు: మెట్ట ప్రాంతంలో తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో రైతులు సాగునీటి కోసం అష్టకష్టాలు పడతారు. డెల్టా ప్రాంతంలో మాదిరిగా ఇక్కడ నీటి లభ్యత ఉండదు. డెల్టా ప్రాంతంలో ఏడాది పొడవునా గోదారమ్మ అండగా నిలిస్తే ఇక్కడ రైతన్నకు వరుణదేవుడు, సాగునీటి వనరులే దిక్కు. అక్కడ నిరంతరం గోదావరి జలాలు ఉరకలేస్తే ఇక్కడ వర్షాలు కురిసినప్పుడే సాగునీటిని ఒడిసి పట్టాలి. వర్షా కాలంలో సాగునీటి వనరుల (చెరువులు, రిజర్వాయర్లు)ను నింపుకుని ఆయకట్టు రైతుల అవసరాలకు అనుగుణంగా సాగునీటిని వినియోగించుకోవాలి. మెట్టలో అంతటి ప్రాధాన్యం ఉన్న సాగునీటి వనరులు భారీగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఎక్కడికక్కడ సమీప రైతులు, రాజకీయ నాయకులు చెరువులను ఆక్రమించేస్తున్నారు. గతంలో వందల ఎకరాల్లో ఉండే సాగునీటి చెరువులు ప్రస్తుతం పదుల ఎకరాల్లోకి వచ్చేశాయి. ఏడాది పొడవునా సాగునీటితో కళకళలాడే చెరువులు ఇప్పుడు రైతుల కనీస అవసరాలను కూడా తీర్చలేకపోతున్నాయి. మరోపక్క తాండవ జలాశయానిది అదే పరిస్థితి. జలాశయంతో పాటు మేజర్, మైనర్ కాలువలు కూడా ఆక్రమణలకు గురికావడంతో సాగునీటి ఎద్దడి తలెత్తుతోంది. మేజర్, మైనర్ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పని చేసి ఆక్రమణలపై దృష్టి సారించకపోతే మెట్టలో సాగు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముంది.

తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ఇలా...

తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో 28,804 ఎకరాల విస్తీర్ణంలో సాగునీటి చెరువులు ఉన్నాయి. ఇరిగేషన్ అధికారుల లెక్కల ప్రకారం మైనర్ ఇరిగేషన్ పరిధిలో 160 చెరువులు 8,839 ఎకరాలు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 70 చెరువులు 19,965 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం ఈ చెరువులన్నీ 50 శాతానికి పైగా ఆక్రమణలకు గురైనట్లు రైతుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దగా ప్రాధాన్యం లేని, జన సంచారానికి దూరంగా ఉన్న చెరువులైతే ఏకంగా కనుమరుగైన పరిస్థితి నెలకొంది.

ఆక్రమణల చెరలో తాండవ జలాశయం

తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించే తాండవ జలాశయం సైతం ఆక్రమణల చెరలో కొట్టుమిట్టాడుతోంది. జలాశయ గర్భంతో పాటు ఆయకట్టుకు నీరందించే మేజర్, మైనర్ కాలువలు సైతం ఆక్రమణలకు గురవుతున్నాయి. నీటి యాజమాన్య కమిటీల్లో రాజకీయ నాయకుల ప్రమేయమే ఈ దుస్థితికి ప్రధాన కారణం. కాలువల ఆక్రమణలతో శివారు ప్రాంత(టైలాండు) రైతులు సాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు, నీటి వివాదాలు తలెత్తుతున్నాయి.

రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి..

సాగునీటి చెరువులను ఆక్రమించుకున్న రైతులు, రాజకీయ నేతలు గ్రామ, మండలస్థాయి రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పట్టాలు పొంది పక్కా ఆధారాలతో ఉన్నారు. అధికారులు ఎవరొచ్చినా చేసేదేమీ లేదనే ధైర్యంతో ఉన్నారు. రెవెన్యూ అధికారులు కూడా రైతుల ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఆక్రమణదారులకు పట్టాలు జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో సాగునీటి చెరువుల వివరాలు

మండలం	మైనర్ ఇరిగేషన్ పరిధిలో చెరువులు	విస్తీర్ణం (ఎకరాల్లో)	పంచాయతీరాజ్ పరిధిలో చెరువులు	విస్తీర్ణం (ఎకరాల్లో)
కోటనందూరు	33	1027	13	7116
రౌతులపూడి	11	1016	13	2464
తొండంగి	31	2772	15	1275
తుని	24	2366	14	3916
ఏలేశ్వరం	9	108	4	1007
శంఖవరం	8	580	3	2280
ప్రత్తిపాడు	44	970	8	1907
మొత్తం	160	8839	70	19,965

సమగ్ర సర్వే చేపట్టాలి



సాగునీటి చెరువులు 50 శాతం వరకూ ఆక్రమణలకు గురయ్యాయి. చెరువుల ఆక్రమణపై గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం లెక్క చేయకుండా ఎక్కడికక్కడ రాజకీయ ప్రాబల్యంతో ఇష్టారాజ్యంగా చెరువులను ఆక్రమించేసుకుంటున్నారు. దీంతో దిగువ పొలాలకు సాగునీరు అందక ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు సాగునీటి చెరువులపై సమగ్రంగా సర్వే చేపట్టాలి. బౌండరీలు నిర్ధారించి సాగునీటి చెరువులను పరిరక్షించాలి.

– కరక అప్పలనాయుడు, రైతు, కేఈ చిన్నయ్యపాలెం

ఘనంగా విష్ణుసహస్రనామ, భగవద్గీత పారాయణలు



ఏలేశ్వరంలో పారాయణ చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: స్థానిక రూపులమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం మహిళలు పలు పారాయణలు చేశారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో విష్ణుసహస్ర, భగవద్గీత, లక్ష్మీ అష్టోత్తర, లలితాసహస్రనామ పారాయణలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కటకం కిరిటీ, తూమురౌతు గురయ్య, సంఘ మహిళాసభ్యులు మల్లేశ్వరి, సూర్యాకుమారి, కల్యాణి, ఇందిరా, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం సభ్యులు వివరాలు అందించాలి

గోకవరం: కామరాజుపేటలోని వేణుగోపాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులు తమ వివరాలు అందించాలని సంఘం సీఈఓ కామిశెట్టి వీరభద్రరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘంలో రికార్డులను గత రెండు నెలలుగా కంప్యూటరైజేషన్ చేస్తున్నామన్నారు. సంఘంలో ఉన్న సభ్యులందరి వివరాలను దాదాపుగా నమోదు చేశామన్నారు. సంఘంలో నమోదు కాని సభ్యులు ఎవరైనా ఉంటే ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు ఫొటోలు, ఫోన్ నంబర్‌తో తమను సంప్రదించాలన్నారు. అలాగే సంఘంలో సభ్యులుగా కొనసాగాలంటే ఈ-కేవైసీ విధిగా నమోదు చేయించుకోవాలన్నారు.

దాడులు చేస్తే సహించేది లేదు

- మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు



ప్రత్తిపాడులో సంఘటన స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంతబాబు, పార్టీ శ్రేణులు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు చేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. ప్రత్తిపాడులో గత బుధవారం రాత్రి జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడి చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్‌తో కలిసి శనివారం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ ఈ నెల 6న జెడ్పీటీసీ రాజరాజేశ్వరి ఇంటిపై దాడి చేశారని, మళ్లీ ఎమ్మెల్యే గత బుధవారం ఎమ్మెల్యే సత్యప్రభ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా బాంబులు, కోడి గుడ్లు, గాజు సీసాలతో దాడి చేసి భయానక వాతావరణాన్ని సృష్టించారన్నారు. దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయడం అభినందనీయమన్నారు. నిందితులను అరెస్టు చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే ఈ తరహా దాడులు చేయడం దారుణమన్నారు. తమ పార్టీ శ్రేణులపై దాడులు చేస్తే ప్రతి దాడులు చేసే సమర్థత తమకు ఉందని, అయితే ఆ సంస్కృతి మనది కాదని పార్టీ శ్రేణులను సముదాయిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ నియోజకవర్గంలో ఈ తరహా దాడులు జరగలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వజ్రకూటం, పల్లపు చామవరం గ్రామాల్లో వైసీపీ శ్రేణులపై దాడులు జరిగాయన్నారు. ఎవరి ప్రోద్బలంతో ఈ తరహా దాడులు చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీసులు దాడులు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు మాట్లాడుతూ దాడులకు పాల్పడటం ద్వారా తమ పార్టీని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని, అది జరిగే పని కాదన్నారు. మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు నాయకత్వంలో పార్టీ శ్రేణులంతా సంఘటితంగా ఉన్నామన్నారు. తామంతా కష్టపడి రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, పార్టీ నాయకులు ధర్మాల సరోజనీదేవి, బందారు మూర్తి, పినిశెట్టి ప్రకాష్, సీంద్రపు భాస్కరరావు, దాడిశెట్టి చక్రధర్, మేడిబోయిన చంద్రోఖర్, పిల్లా చిన్నా, తటవర్తి రామన్నదొర, అమరాధి కాశి, జువ్వల బాబులు, బత్తుల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు



గుమ్మళ్లదొడ్డిలో వల్మీక వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి, తంటికొండ గ్రామాల్లో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. గుమ్మళ్లదొడ్డి శివారున పుట్టలో వెలసిన వల్మీక వేంకటేశ్వర స్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పాదరక్షలు లేకుండా ఆయా గ్రామాల నుంచి ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. అలాగే తంటికొండలో వెంకటగిరి కొండపై స్వయంభూగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నీటి సరఫరా పునరుద్ధరణ



భావవరంలోని ఫిల్టర్ బెడ్

జగ్గంపేట: మండలంలోని భావవరంలో ఉన్న ఫిల్టర్ బెడ్ ద్వారా శనివారం జగ్గంపేట, గండేపల్లి మండలాలకు నీటి సరఫరా పునరుద్ధరించినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాంజీ తెలిపారు. గత రెండు రోజులుగా కరెంట్ సరఫరాలో అంతరాయం వల్ల నీటి సరఫరాకు ఇబ్బంది కలిగిందన్నారు. భావవరం స్కీమ్ ద్వారా సరఫరా అవుతున్న నీరు కలుషితమైందని సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరాను పునరుద్ధరించడంతో స్కీమ్ ద్వారా శనివారం అన్ని గ్రామాలకు నీటిసరఫరా చేశామని వివరించారు.

కళాశాలకు వాటర్‌ట్యాంకు బహూకరణ



ప్రభుత్వ జూనియర్ కాలేజీకి వాటర్‌ట్యాంకు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

తుని: స్థానిక బ్యాంకు కాలనీలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీకి రోటరీ క్లబ్ ప్రతినిధులు రూ.30 వేల విలువ చేసే ప్లాస్టిక్ వాటర్ ట్యాంకును బహూకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మికి రోటరీ ప్రతినిధులు శనివారం ట్యాంకు అందజేశారు. కళాశాలలో ఉన్న 740 మంది విద్యార్థినులు వాటర్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, వాటర్ ట్యాంకు ఇవ్వాలని కళాశాల యాజమాన్యం కోరడంతో రోటరీ సేవా కార్యక్రమంలో భాగంగా ట్యాంకును బహూకరించినట్టు రోటరీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వర్మ, కార్యదర్శి కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీవైఈఓ తనిఖీలు



రౌతులపూడి హైస్కూల్లో విద్యార్థుల అభ్యసనను తెలుసుకుంటున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు

రౌతులపూడి: మండలంలోని రౌతులపూడి, లచ్చిరెడ్డిపాలెం, బలరామపురం, ములగపూడి, ఎస్.అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పెద్దాపురం డీవైఈఓ ఎస్.వెంకటేశ్వరరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థుల అభ్యసన స్థాయిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 గాడి కొండబాబు, హెచ్ఎంలు కోళ్ల రాంబాబు, శేషుకుమార్, మురళీకృష్ణ, చిట్టియ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 67 కేసుల పరిష్కారం



ప్రత్తిపాడు కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి కాటం భాను

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి కాటం భాను 67 కేసులను పరిష్కరించారు. రెండు మనోవర్తి కేసుల్లో రూ.1.50 లక్షలు, రెండు గృహ హింస కేసుల్లో రూ.1.50 లక్షలు, ఒక చెక్ బౌన్స్ కేసులో రూ.3 లక్షలు బాధితులకు చెల్లింపులు చేయించారు. ఇద్దరు బ్యాంకు రుణం ఎగవేత దారుల నుంచి రూ.32 వేలు, పది మంది ఎగవేతదారుల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు రూ.16,987 చెల్లించాలంటూ తీర్పు నిచ్చారు. మూడు సివిల్ కేసుల్లో రూ.3.31 లక్షలు, 45 క్రిమినల్ కేసుల్లో రూ.6 లక్షలు చెల్లింపుల జరపాలని చెప్పారు.

ఒక క్రిమినల్ కేసులో రూ.6 వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో బెంచ్ మెంబర్ కె.సూర్యప్రకాశరావు, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



ఎస్ఎస్‌పట్నంలో చోరీకి గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

రౌతులపూడి: మండలంలోని ఎస్ఎస్‌పట్నంలో అల్లం రామన్నదొర, అల్లం బాబులకు చెందిన నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధిత రైతులు రౌతులపూడి పోలీసుస్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. వ్యవసాయ మకాల వద్ద ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



హేమంత్ (ఫైల్)

శంఖవరం: మండలంలోని నెల్లిపూడిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే...గ్రామానికి చెందిన రాయవరపు హేమంత్ (26) శాంతి ఆశ్రమం రోడ్డు నుంచి ద్విచక్ర వాహనంపై నెల్లిపూడి వస్తుండగా కత్తిపూడి నుంచి శంఖవరం వెళ్లుతున్న ఆటో బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను స్థానికులు 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడు హేమంత్‌కు తండ్రి లేడు. కష్టపడి పని చేస్తూ తల్లిని బాగా చూసుకుంటున్నాడు. కొడుకు మృతి చెందడంతో తల్లి కన్నీరు మున్నీరైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ



జె.అన్నవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరంలో శనివారం సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. గ్రామంలోని పలు ప్రాంతాల మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి చల్లారిన నీటిని తాగాలన్నారు. భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు స్వరాజ్యం, రాంబాబు, హెల్త్ సిబ్బంది అనంతలక్ష్మి, జగదీశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది కె.సునీత, వీరప్రభావతి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరులో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

సీజనల్ వ్యాధులపై అవగాహన

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని కొత్తూరులో ప్రజలకు శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందన్నారు. ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదని, లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గండేపల్లి: బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ సూచించారు. మండల కేంద్రమైన గండేపల్లిలో శనివారం బాల్య వివాహాలు, అతిసార వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు బాల్య వివాహాలు చేస్తే ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. తల్లిదండ్రులు బాలబాలికలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. బాలికలకు బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు గాని, 100కు గాని సమాచారం ఇవ్వాలన్నారు. ఎంపీడీఓ ఎస్.హనుమంతరావు మాట్లాడుతూ ప్రస్తుతం రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిశుభ్రత పాటించాలన్నారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కేవీ నరేష్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎ.నాగపార్వతి, విద్యాశాఖ, అంగన్‌వాడీ, ఆశా, తదితర సిబ్బంది పాల్గొన్నారు.